ల్సిన విషయం ఏమంటే గుత్తి వంకాయ కూరంటే అన్నపూర్ణకి ప్రాణం. ఆ కూర ఎన్నోసార్లు ఆమె తనకి వండి పెట్టింది. ఇప్పుడు.. ఆమె ఆరోగ్యం బాగాలేనప్పుడు.. క్యాటరింగ్ హోమ్‌లో గుండిగ నిండా ఘుమఘుమలాడే ఆ కూర కళ్ల ఎదుట కనిపిస్తున్నా.. ప్యాకెట్లలో వేడివేడిగా కస్టమర్లకి వెళ్లిపోతున్నా.. ఒక్కముక్క కూడా తను అన్నపూర్ణ కోసం తీసుకొని వెళ్లలేదు. చాలా బాధగా ఉంది పతంజలికి.



* * *

..అలా గోడకి జారబడి నిస్సత్తువతో కూర్చుని ఉన్న పతంజలికి కొద్దిగా కునుకు పట్టేసింది. అందులో ఓ కల. తనని వదిలేసి అలా పైపైకి వెళ్లిపోతున్న అన్నపూర్ణ.. ఒంటరిగా మిగిలి కంటికి మంటికి ఏకధారగా ఏడుస్తున్న తనని ఓదార్చుతున్న ఎవరిదో అమృత హస్తం. తన తల నిమురుతూ.. చెంపల మీది కన్నీరు తుడుస్తూ.. ఉలిక్కిపడి కళ్లు తెరిచాడు పతంజలి.

ఎదురుగా అన్నపూర్ణ.. కుక్కిమంచం పట్టీమీద కూర్చుని తనవైపు వంగి, తన ముఖంలోకి ప్రేమగా, ఆత్మీయంగా చూస్తూ, తల నిమురుతూ, చెంపలు తడుముతున్నది. విస్మయంగా చూశాడు ఆమె ముఖంలోకి.

నీరసంగా.. తుంపుడు మాటలతో..

''ఇలా.. మంచం మీద.. కూర్చోండి!'' అన్నది.

''ఫర్వాలేదులే! నాకిక్కడ బాగానే ఉంది. నీకెలా ఉందో చెప్పు!?'' పూడుకుపోతున్న స్వరంతో అన్నాడు.

తన పక్కన మంచం మీద తట్టుతూ మళ్లీ పిలిచింది. లేచి, పక్కనే కూర్చుని, ఆమెని పొదివి పట్టుకుని..

''ఏంటమ్మా?'' అనడిగాడు గోముగా.

ఒక్కసారి కళ్లు మూసుకుని తెరచి, నీరసంగా, పతంజలి వీపు నిమురుతూ అన్నది..

''మీరు.. నా గురించి.. ఎక్కువగా.. ఆలోచిస్తూ.. భయపడుతున్నారు. నాకు.. ఏమీ కాదు.. ముందు మీ ఆరోగ్యం.. జాగర్త!'' ఆమె గొంతు అనురాగం నిండిన భయంతో వణికింది. ఆర్ద్రమయిన హృదయంతో ఆమె తలని గుండెలకు హత్తుకున్నాడు పతంజలి.

''ఏమైనా.. కబుర్లు.. జోకులూ.. చెప్పండి. నేను.. ఎక్కువగా.. మాట్లాడలేను.. వింటాను'' అంటున్న భార్య మాటలు ఈరోజు కొంత విచిత్రంగానూ.. ముద్దుగానూ.. ఏదో తెలియని గుబులుగానూ అనిపించాయి.

తమ వివాహ జీవితంలోని అనేక మధుర క్షణాలనీ, హాస్య సంఘటనలనీ గుర్తు చేస్తూ పతంజలి అలా చాలాసేపు మాట్లాడుతూనే ఉన్నాడు. అతని ఛాతిమీద తల ఆన్చి, పెదాల మీద చెరగని చిరునవ్వుతో అతని కళ్లలోకి ఆరాధనగా చూస్తూ ఆమె వింటూనే ఉంది.

అంతా అతని చేతే మాట్లాడిస్తూ, మౌనంగా వింటూనే ఉన్నదల్లా ఒక్కసారిగా నోరు విప్పి..

''ఏమండీ.. ఓ విచిత్రమైన కోరిక కోరనా? నాకు మీ చేత్తో.. అన్నంలో వేడివేడి గుత్తి వంకాయ కూర.. కలిపి.. తినిపిస్తే.. తినాలని ఉందండీ!'' అన్నది.

విస్మయంతో ఉలిక్కిపడ్డాడు పతంజలి!!

తనకోసం వండి పెట్టడం.. అనేక మంది బీదాబిక్కీ కోసం వండి వార్చి వడ్డించడమే చేసిన అన్నపూర్ణ.. ఈనాడు ఇలా.. ఈ కోరిక..!!!? అతి సామాన్యమైన చిన్న కోరికే ఇది!.. కానీ.. ఎలా?! వేడివేడి గుత్తి వంకాయ కూర.. తనకి వండటం చేతకాదు. కానీ, తన చేతుల మీదుగా ఇస్తూనే ఉంటాడు తను కస్టమర్లకి. అయినా, ఒక్క ప్యాకెట్టూ తను ఇంటికి తెచ్చుకుని, ఆమెకి తినిపించే ప్రాప్తం లేదు. పోనీ.. మేనేజర్‌తో..

'డబ్బులిస్తాను.. ప్యాకెట్ కావాలి' అందామంటే.. అతగాడి అహం దెబ్బతిని, మొదటికే మోసం రావచ్చు. బాధతో గిలగిలలాడి పోయాడు పతంజలి.

''ఏం.. మీ చేత్తో ఓసారి ఓ ముద్ద తినిపిస్తారా?'' మళ్లీ అడిగింది అన్నపూర్ణ గోముగా.. ఆఖరి కోరికేమో!? అన్నంత భ్రాంతిని ధ్వనించే స్వరంతో. చలించి పోయాడు పతంజలి..

ఏదో స్థిర నిర్ణయానికి వచ్చిన వాడై..

''త-ప్ప-కుం-డా..'' అన్నాడు.

రెండు రోజులు గడిచాయి. ఏవేవో వేరే పచ్చళ్లూ పులుసుల ప్యాకెట్లతో ఇంటికి వచ్చిన పతంజలి భార్యకి అన్నం కలిపి తినిపిస్తూ.. చాలా బిడియ పడుతూ.. మూగవాడే అయిపోయాడు.

మూడవ రోజు..

క్యాటరింగ్ హోం కిచెన్‌లో.. వంట పనులు జరుగుతుండగా.. కమ్మని గుత్తి వంకాయ కూర సువాసన.. పతంజలి గుండెలు వేగంగా కొట్టుకున్నాయి.

ప్యాకెట్లు తయారయ్యాయి. తను పంచాల్సిన బ్యాగుల్ని సైకిల్‌కి తగిలించుకున్నాడు పతంజలి. మనసు రాయిచేసుకుని.. తెగించి.. సైకిల్ని ఈరోజు మొదటే ఇంటి మార్గం పట్టించాడు.. అతని మస్తిష్కంలో ఆశగా తను కోరిన ముద్దకోసం ఎదురుచూస్తున్న అన్నపూర్ణ, ఇంకా నిత్యం మందు మీదుండే ఆ కాలనీ సెవెంత్ క్రాస్‌లోని నార్త్ ఇండియన్ డివోర్సీ ముసలాయన మాత్రమే మెదులుతున్నారు ఇప్పుడు. ఆ ముసలాయన కొన్ని కర్రీస్‌ని అలా ప్యాకెట్ల పళంగానే డస్ట్ బిన్‌లో పడెయ్యడం తనకి తెలుసు. అందులో వంకాయ కూర ఒకటి.. అతగాడికి పడదు. అనైతికమే అయినా.. ఇప్పుడు తను ఆ కర్రీ తీసుకువెళ్లక పోయినా ప్రాబ్లం ఏమీ ఉండదు. అతగాడికి కారణం చెప్పొచ్చు.

వేగంగా ఇంటికి చేరాడు పతంజలి.

అన్నంలో గుత్తి వంకాయ కూర గబగబా వేడి, చల్లారిపోకూడదనే ఆతృతతో కలిపి.. రెండు ముద్దలు స్వయంగా అన్నపూర్ణ నోటికి అందించాడు. ఇష్టంగా ఆ ముద్దల్ని తినగలిగిన అన్నపూర్ణ.. 'ఇక చాలు' అన్నట్లుగా ఎంతోతృప్తిగా నవ్వుతూ.. కృతజ్ఞత, ఆరాధనా నిండిన చూపులతో పతంజలి కళ్లలోకే చూస్తూ.. చూస్తూ.. చూస్తూ..

కదలిక లేక 'నిలిచిపోయిన' ఆమె ముఖంలోని అలౌకికమైన ఆ తృప్తినే చదువుతున్న పతంజలి గుండెలు పొంగాయి.

''పతంజలీ!'' గుమ్మం బయటి నుంచి పిడుగు లాంటి పిలుపు.

గొంతుని గుర్తుపట్టాడు పతంజలి. భుజం మీద వాలి ఉన్న భార్య తలని అతిసున్నితంగా తలగడ మీదికి చేర్చి, సుతారంగా ఆమె కనురెప్పల్ని వాల్చి, యాంత్రికంగా లేచి, నిబ్బరంగా బయటికి నడిచాడు.

''ఇటువైపు వెళ్తుంటే నీ ఇంటి బయట మన క్యారేజీ సంచులతో నీ సైకిల్ కనిపించింది. అంటే.. దొంగతనంగా కర్రీలను ఇంటికి తెచ్చుకు తింటున్నావన్న మాట రోజూ! ఇక నువ్వు రేపట్నుంచీ పనిలోకి రానక్కర్లేదు. ఈనెల జీతం కూడా ఇవ్వను''.. పతంజలి ఎంగిలి చేతివైపు చూస్తూ కోపంగా ఉరిమి, వెళ్లిపోయాడు మేనేజర్.

అతని మాటలకి పతంజలిలో ఎటువంటి స్పందనా లేదు. చేయి కడుక్కుని, అన్నపూర్ణ కనురెప్పల మీద సుతారంగా ముద్దుపెట్టి.. తన ప్రియనేస్తమైన సైకిల్ని చేతుల్లోకి తీసుకున్నాడు. రోజూ కంటే వేగంగా తన డ్యూటీ ప్రకారం లంచ్ ప్యాకెట్స్ బట్వాడా చేసేశాడు.

అ తర్వాత...

..అన్నపూర్ణ ఆఖరి చూపుల్లోని తృప్తితో నిండిన ఆరాధనతో కూడిన రూపమే కళ్లముందు మెదులుతుండగా.. ఆకాశాన్ని తాకిన ఉత్సాహంతో పెడల్స్ మీద బలంగా పాదాలను తొక్కుతూ.. ఓనాడు రేసుల్లో పాల్గొని విజయాలను సాధించిన ఘడియల్ని నెమరు వేసుకుంటూ.. హైవే మీద అలా.. అలా.. గాలిలో తేలిపోతూ..

''కమాన్ కమాన్.. పతంజలీ!''..

అభిమానుల కేకలు..

''కమాన్ ద హీరో ఆఫ్ ద సైకిల్ రేసెస్..'' అన్నపూర్ణ ప్రోత్సాహపు కేరింతలు.

చెవుల్లో మారుమోగుతున్నాయి.

తొక్కుతూనే ఉన్నాడు పతంజలి. ఎక్కడికో తెలియదు. ఒక్కటే కోరిక.. ఈ ప్రపంచాన్ని జయించి, అన్నపూర్ణ వెళ్లిపోయిన లోకానికి చేరి, ఆమెని కలవాలని ఆరాటం. అంతే!..

ఒక్కసారిగా ఛాతి ఎడమ వైపున ఎగసిన రక్తపు కెరటం.. రోడ్డు పక్కగా చల్లని చెట్టు నీడలో తన ప్రియ నేస్తం సైకిల్‌తోపాటు అలవోకగా వాలిపోతున్న పతంజలిలో అలౌకికమైన ఆనందంతో కూడిన స్పందన.. తన(ను) అన్నపూర్ణని చేరుతున్న అ-మృత క్షణాలు ఆసన్నమయ్యాయని.. ■

## తులసి బాలకృష్ణ



మనిషై భూమ్మీద పుట్టాక.. కొన్ని బంధాలు మనల్ని అల్లుకుంటాయి. అందులో కొన్ని అలౌకికంగా మన గుండెలను గుబాళింపజేస్తే.. మరికొన్ని అర్థంకాని ఆవేదనతో ఘూర్ణింపజేస్తాయి. ఓ అలౌకిక మమకారం, ఆత్మీయత, స్నేహం మనల్ని స్థిరంగా నిలవనీయక కుదిపేస్తాయి. ఈ కథలో.. ఆ విషయాన్నే ఆవిష్కరించే ప్రయత్నం చేశారు రచయిత తులసి బాలకృష్ణ. రచయితగా, రంగస్థల నటుడిగా, దర్శకుడిగా తెలుగువారికి సుపరిచితులు. వీరి స్వస్థలం హైదరాబాద్. బ్యాంక్ మేనేజర్‌గా పనిచేసి, విరమణ పొందారు. నాలుగున్నర దశాబ్దాల కళా సేవలో.. 500లకు పైగా కథలు, 40 నాటికలు, 8 నవలలు, 3 నాటకాలు, రేడియో నాటకాలు, టీవీ నాటకాలు రాశారు. వీటిలో హాస్యం, సరసం, సస్పెన్స్, సాహసం.. ఇలా అన్నిరకాల రసాల రచనలూ ఉన్నాయి. నాటకాలలో రచన, నటన, దర్శకత్వాలకు నందులు అందాయి. మిత్రులు ఆత్మీయతతో సన్మానించి.. 'రచనా విరించి', 'అక్షర కళా యశస్వి' అనే బిరుదులు కూడా ఇచ్చారు. బళ్లారి రాఘవ, గురజాడ, శ్రీశ్రీ అవార్డులూ దక్కాయి. నమస్తే తెలంగాణ – ముల్కనూరు సాహితీ పీఠం ఏటా నిర్వహించే కథల పోటీలలో మూడుసార్లు పాల్గొనగా.. మూడుసార్లూ బహుమతులు అందుకున్నారు.